వేగంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పరింపూడి-1, మంగపతిదేవిపేట, పొంగుటూరు, బోడిగూడెం, కన్నాపురం-1, యర్రంపేట-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్యారోగ్య శాఖ సిబ్బంది బుధవారం ఇంటింటా సర్వే ప్రక్రియను వేగవంతం చేశారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్, హెచ్‌బీ, మలేరియా, డెంగీ, క్షయ పరీక్షలు చేసి, ప్రతి వ్యక్తికి వైద్యుల సలహాతో ఉచితంగా మందులు తీసుకునేందుకు టోకెన్లు పంపిణీ చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈనెల 30 నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలియజేస్తున్నారు. వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్లు ప్రజలను తరలించేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనీ ప్రజలకు వివరిస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్తేరు రాణి ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం మండలం పరింపూడిలో సర్వే చేస్తున్న వైద్యాధికారులు

అనారోగ్య వివరాల సేకరణ

జంగారెడ్డిగూడెం: ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి ప్రజల అనారోగ్య వివరాలు తెలుసుకోవడంతో పాటు, వైద్య అవసరాలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్ సచివాలయం పరిధిలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి, ప్రజలకు పరీక్షలు నిర్వహించారు.

చింతలపూడిలో..

చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని మండల పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బి.రాంబాబు నాయక్ కోరారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని అభివృద్ధి, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీకృష్ణ, రాఘవాపురం, యర్రగుంటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో గుండె వైద్యశిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించాలని అభ్యర్థన మేరకు విజయవాడ ఉషా కార్డియాక్ సెంటర్ గుండె వైద్యులు వైపీ రావు ఆధ్వర్యాన వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు 35 మందికి గుండె పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ నాయకులు పోల్నాటి రాజా, పోల్నాటి నాని, పోల్నాటి రాజు, బల్లే చంద్రరావు, పోల్నాటి సత్తిబాబు, తన్నీరు కృష్ణ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

అదనపు తాగునీటి బోరు నిర్మాణ పనుల ప్రారంభం

కొయ్యలగూడెం: బోడిగూడెం గ్రామంలో అదనపు తాగునీటి బోరు నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. సర్పంచ్ కడకట్ల గడ్డియ్య ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. తాగునీటి వాటర్ ట్యాంక్‌తో సహా బోరు నిర్మాణానికి రూ.23 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో నిధులను మంజూరు చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసుబోయిన సుభాషిణి, టి.సుబ్బారావు, తేలే నాగ శ్రీను, వాసుబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా పురస్కారానికి డాక్టర్ వరప్రసాద్ ఎంపిక


డాక్టర్ ఊటుకూరి వరప్రసాద్

కొయ్యలగూడెం: గుర్రం జాషువా జాతీయస్థాయి సాహితీ పురస్కారానికి తనను ఎంపిక చేసినట్లు కొయ్యలగూడేనికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, ప్రముఖ సాహితీవేత్త ఉటుకూరి వరప్రసాద్ తెలిపారు. ఏలూరులో గురువారం జరిగే జాషువా జయంతి వేడుకల్లో పురస్కారాన్ని ప్రదానం చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఉటుకూరి చేసిన సాహిత్య, సామాజిక రచనలకు, దళిత సాహిత్య విమర్శలకు గానూ ఈ పురస్కారాన్ని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది.

వైభవంగా గణపతి హోమం

ద్వారకాతిరుమల: గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుని మందిరంలో గణపతి హోమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఎస్సై టి.సుధీర్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ గణపతి హోమాన్ని జరిపారు. ఈ హోమ క్రతువులో చినవెంకన్న దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు, ఎస్సై సుధీర్‌తో పాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్ పురం ఐటీడీఏలో బుధవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ పలు సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల నుంచి పలు సమస్యలపై వినతి పత్రాలను గిరిజనులు పీఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలి

కామవరపుకోట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ కడిమి రమేష్ అన్నారు. బుధవారం తడికలపూడి గ్రామ సచివాలయం నందు ఉపాధి హామీ పథకం 2022-2023కు సంబంధించి సామాజిక తనిఖీలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. జెడ్పీటీసీ రమేష్ పాల్గొని ఉపాధి కూలీలను సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. కార్యక్రమంలో తనిఖీ పరిశీలకులుగా మండల విద్యాశాఖ అధికారి డి.సుబ్బారావు, డీఆర్‌పీ నందిగం బాలకోటయ్య, సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఓ భక్తురాలు బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. రాజమండ్రికిచెందిన ఎం.విజయ భాను ప్రభ ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 15 మంది విద్యార్థుల ఎంపిక

ద్వారకాతిరుమల: మండలంలోని రామసింగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.జయసుధాకర్ తెలిపారు. అలాగే ఒక విద్యార్థిని స్టాండ్ బైగా నిలిచినట్లు చెప్పారు. భీమడోలు మండలం పోలసానిపల్లిలోని గురుకుల పాఠశాలలో బుధవారం సెపక్ తక్రా జిల్లాస్థాయి ఆటల పోటీలు జరిగాయి. అందులో అండర్-19 బాలికల విభాగం నుంచి డి.లిఖిత, టి.భవిత వాణి గెలుపొందారు. వీరు త్వరలో ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థినులను అభినందించిన వారిలో పాఠశాల హెచ్‌ఎం, పీడీలతో పాటు, గ్రామ సర్పంచ్ ధానేశ్వరరావు, ఉప సర్పంచ్ ఉప్పల మునేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ బి.రమేష్ తదితరులున్నారు.


ద్వారకాతిరుమల మండలంలో విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఈ.మల్లయ్య తెలిపారు. ఈనెల 25, 26 తేదీల్లో కైకరం హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయని పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయి పోటీలకు తమ విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. రన్నింగ్ అండర్ 17 బాలుర 200 మీటర్ల విభాగంలో సెకండ్, 1,500 మీటర్ల విభాగంలో ఫస్ట్, జావెలిన్ త్రో అండర్ -14 బాలుర 600 మీటర్లలో ఫస్ట్, 400 మీటర్లలో సెకండ్, అండర్ 17 బాలిక 400 మీటర్ల విభాగంలో ఫస్ట్, అండర్ -14 400 మీటర్ల విభాగంలో ఫస్ట్, 200 మీటర్లలో సెకండ్ సాధించినట్లు తెలిపారు. వాలీబాల్ అండర్ 17 విభాగంలో జి.ప్రవీణ్, జి.నవతేజ, వాలీబాల్ అండర్-14 విభాగంలో జె.అభి, కిషోర్, సుజీత్, బాల్ బ్యాడ్మింటన్ అండర్ -17 బాలురు విభాగంలో డి.జోష్, ఎం.ప్రసాద్, జి.ప్రవీణ్, బి.అరవింద్, బాల్ బాడ్మింటన్ అండర్-14 బాలురు విభాగంలో పి.నీరజ్, మహేష్‌బాబు, సోమ శివతేజలు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను హెచ్‌ఎం పి.సురేష్, సర్పంచ్ యోహాను, పీఎంసీ చైర్మన్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

వీఎస్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థుల ఎంపిక

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి పోటీలకు తమ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు వీఎస్‌ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌ఎన్ స్వామి బుధవారం తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న యంగళ రాహుల్, పాకా సంజయ్‌లు సెపక్ తక్రా (లెగ్ వాలీబాల్ గేమ్) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 14వ తేదీ పెదవేగి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్‌లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించగా ఈ ఇరువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కామవరపుకోట: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని ఆడమిల్లి, కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామసుందరి, బి.విజయభారతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న ఏలూరు కేపీడీటీ పాఠశాల నందు జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కామవరపుకోట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జెస్సీ, సాయిలహరి, దైవ సుప్రియ, డి.జస్టిన్, ఎ.శ్యామ్, బి.రోహన్, ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వల్లూరి సంతోషిణి, చెంచాల గుణప్రవల్లిక, సిద్ధబత్తుల శరణ్, జి.నిస్సి, సంధ్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

జంగారెడ్డిగూడెం ఆస్పత్రి 'కాయకల్ప' అవార్డుకు సిఫార్సు

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ ఆసుపత్రులకు జాతీయ స్థాయిలో అందించే 'కాయకల్ప' అవార్డుకు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి పేరును సిఫార్సు చేసినట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జంగారెడ్డిగూడెంలో 'జగనన్నకు చెబుదాం..' స్పందన కార్యక్రమం అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలున్నాయని, ఐటీడీఏలో మాతా, శిశు, మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెప్పారు. ఆసుపత్రిలో ఎంసీహెచ్, పోస్టుమార్టం విభాగాల నిర్మాణాన్ని డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో గిరిజనులకు వైద్యసేవలందించేందుకు గానూ ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పీడియాట్రిక్ విభాగంలో టెస్ట్‌లకు బయట ల్యాబ్‌లలో చేయిస్తున్నారని, వీటి కారణంగా పేదలకు ఆర్థిక భారం అవుతుందని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా వీటిపై విచారణ చేయిస్తానని కలెక్టర్ చెప్పారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ స్లీవ్ జోజి, ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.


ఆస్పత్రిలో వైద్యసేవలపై రోగులను ఆరా తీస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

వరసిద్ధి వినాయక ఆలయ నిర్మాణానికి వినతి

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలోని దేవస్థానం హైస్కూల్ వద్ద చిన్నపాటి రేకుల షెడ్డులో ఉన్న వరసిద్ధి వినాయకుడికి ఆలయాన్ని నిర్మించాలని కోరుతూ చినవెంకన్న దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావుకు పలువురు గ్రామస్తులు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. క్షేత్రంలో విఘ్నేశ్వర ఆలయం ఎక్కడా లేదని, దీన్ని అభివృద్ధి చేస్తే అంతా మంచి జరుగుతుందని చైర్మన్‌కు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ సుధాకరరావు, ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావులు గుడి నిర్మాణానికి ముందుకొచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, యిమ్మడి పవన్‌కుమార్, పాకనాటి శేషుబాబు, దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, అంబటి వెంకటేష్, దాస్యం భాస్కర్ పాల్గొన్నారు.


శ్రీవారి దేవస్థానం చైర్మన్ సుధాకరరావుకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అట్టహాసంగా గణేష్ నిమజ్జనం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలో గణేష్ నిమజ్జన వేడుకలు బుధవారం అట్టహాసంగా జరిగాయి. స్థానిక శ్రీవారి దేవస్థానం హైస్కూల్ వద్ద నెలకొల్పిన గణేషునికి ఉత్సవ కమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు ప్రారంభించారు. డీజే సందళ్లు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, యువకుల ఆనందోత్సాహాల నడుమ స్వామివారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ప్రతి ఇంటి ముంగిట గణేషునికి భక్తులు నీరాజనాలు సమర్పించారు. రాత్రి పంగిడిగూడెం వద్ద పోలవరం కాలువలో గణేషుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.


ద్వారకాతిరుమలలో గణేషుని ఊరేగింపును ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అంకాలగూడెం శ్రీ లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణేషునకు ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును యువకులు నిర్వహించారు. శ్రీరామ్ నగర్ వాటర్ ట్యాంక్ రామాలయం వద్ద గురువారం మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం నుంచి గణపతి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చింతలపూడి: పట్టణంలోని పలు గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, నృత్యాలు, విచిత్ర వేష ధారణలతో గణపతి విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం గణనాధుల ఊరేగింపు కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం నాగిరెడ్డిగూడెం సమీపంలోని తమ్మిలేరులో భక్తుల జయజయ ధ్వానాల మధ్య గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

పోలవరం రూరల్: మండలంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో వాడవాడలా ఏర్పాటు చేసిన గణనాధులకు 9 రోజులపాటు పూజల అనంతరం విగ్రహాలను ఊరేగించారు. యువకులు కేరింతలు కొడుతూ జై గణేశా, జైజై గణేశా అంటూ నృత్యాలు చేశారు. ఊరేగింపు అనంతరం పట్టిసీమ రేవు, గోదావరి నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జన సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్‌కు వినతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలం ఆక్రమణకు గురైందని, చర్యలు తీసుకోవాలని కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కోరారు. బుధవారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌కు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ కళాశాలకు సంబంధించి 4.01 ఎకరాల భూమి ఉందని, ఈ భూమిలో కొంత భాగాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి ఫెన్సింగ్ వేసుకున్నారన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అర్జీని స్వీకరించిన కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మొగల్లపు వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల రిటైర్డ్ పీఈటీ సత్యనారాయణరాజు, రాఘవరాజు ఆదివిష్ణు, మానవత మూర్తి, కేమిశెట్టి మల్లిబాబు, షేక్ ముస్తఫా, బోడ సత్యనారాయణ, అడపా శేషుకుమార్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు , ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ శిక్షణ ఉపాధ్యాయుల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సొసైటీల సర్వసభ్య సమావేశాలు

టి.నరసాపురం: టి.నరసాపురం సహకార సంఘానికి రావాల్సిన బకాయిలకు, చెల్లింపులకు మధ్య వ్యత్యాసం రూ.40 కోట్లు ఉందని సంఘ త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్ కె.శ్రీనివాసరావు తెలిపారు. టి.నరసాపురం సొసైటీ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంపై 51 ఎంక్వైరీ పూర్తయిందని, ఉన్నతాధికారుల ఆదేశాలతో సంఘ కార్యదర్శిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సహకార సంఘం రూ.8 కోట్లు నష్టంలో ఉందని, రూ.23కోట్ల సంఘ ఆస్తుల విలువ ఉందన్నారు. రావాల్సిన బకాయిల వసూళ్లల్లో చట్టపరమైన చర్యలు చేపట్టి బకాయిలు వసూలు చేసి డిపాజిట్‌దారులకు సాధ్యమైనంత త్వరితగతిన చెల్లింపులు చేస్తామని వివరించారు.

కె.జగ్గవరంలో..

కె.జగ్గవరం సహకార సంఘం ఆవరణలో స్థల దాత మాజీ సంఘ అధ్యక్షుడు వెలిది కృష్ణమూర్తి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మహాజన సభ బుధవారం ఏకగ్రీవంగా తీర్మానించింది. సంఘ చైర్‌పర్సన్ మధు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఇటీవల మరణించిన కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మధు మాట్లాడుతూ గుడ్లపల్లిలో దాతల సహకారంతో 50 సెంట్ల స్థలాన్ని సేకరించి, రూ.40 లక్షల అంచనా వ్యయంతో మల్టీపర్పస్ గోడౌన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. అల్లంచర్ల రాజుపాలెంలో ఎరువుల గోడౌన్, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నటు తెలిపారు. సమావేశంలో పర్సన్‌లు వంటిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


టి.నరసాపురం సొసైటీ సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న చైర్‌పర్సన్ కె.శ్రీనివాసరావు

జల శుద్ధికి తక్షణ చర్యలు అవసరం

టి.నరసాపురం: బొర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ బుధవారం పరిశీలించారు. పథకాన్ని వినియోగించుకుంటున్న విద్యార్థుల సంఖ్య తదితర వివరాలను ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించారు. విద్యార్థులు ఇంటి నుంచి తాగునీటిని తెచ్చుకోవడం గమనించి వాటర్ ప్లాంట్ పనిచేయక పోవటానికి కారణాలను అడిగారు. ప్రత్యేక విద్యుత్ సరఫరా కోసం ప్రయత్నిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. క్లాస్ రూమ్‌లో డిజిటల్ సేవలు పరిశీలించి అదనపు పరిజ్ఞానాన్ని పొందేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని ప్రతి విద్యార్థి సక్రమంగా వినియోగించుకోవాలని విజయకృష్ణ కోరారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న విజయకృష్ణ

పీసా చట్టం అమలయ్యేలా చూడాలి

బుట్టాయగూడెం: షెడ్యూల్ ప్రాంతంలో పీసా చట్టం అమలు చేయాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన బుట్టాయగూడెం సచివాలయంలో కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 5వ షెడ్యూల్ ప్రాంతంలో పీసా చట్టం అమలుపై కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకుని పీసా నిబంధనలు అమలయ్యేలా చూడాలని కోరారు.

పంట బోదె పనుల పూర్తికి కృషి

బుట్టాయగూడెం: పంట బోదెల ఏర్పాటుతో పోగొండ రిజర్వాయర్ నీరు పంటలకు పుష్కలంగా అందుతుందని డ్వామా పీడీ పి.రాము అన్నారు. మండలంలోని అచ్చియ్యపాలెంలో రైతులతో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు పోగొండ రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వకు సంబంధించి నిమ్మలగూడెం, అచ్చియ్యపాలెం పంట బోదు కాల్వ పనులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పోగొండ రిజర్వాయర్‌లో 158 మీటర్లలో నీరు నిల్వ ఉండి సర్‌ప్లస్ వాటర్ కిందకు వెళ్తుందని చెప్పారు. పంట కాల్వ పనులు పూర్తి చేసుకోవడం ద్వారా రిజర్వాయర్‌లోని పంటలకు వినియోగించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రఫుల్ కుమార్, ఎంపీ ఏఈ సురేష్, సర్పంచ్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.